క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి

ఎమ్మిగనూరుటౌన్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య మాదిగ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని బీజేపీ హామీ ఇచ్చి పట్టించుకోవడం లేదన్నారు. తమ డిమాండ్ సాధన కోసం ఈనెల 26,27 తేదీల్లో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ధర్నా చేయనున్నామన్నారు. సమావేశంలో ఎంఆర్పీఎస్ నాయకులు ప్రకాశం, గాలెన్న, జయన్న, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు జాబితా విడుదల

గోనెగండ్ల: రబీ సీజన్‌లో 2022–23 గాను పంటలు నమోదు చేసుకున్న రైతుల జాబితాను విడుదల చేసినట్లు వ్యవసాయ అధికారి రాజాకిషోర్ తెలిపారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలోని రైతు భరోసా కేంద్రంలో రైతులతో కలిసి పంట నమోదు జాబితాను విడుదల చేశారు. పంటసాగు చేసిన రైతులు జాబితాలో పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని సూచించారు. లేకపోతే సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

దంతాలను శుభ్రంగా ఉంచుకోండి



క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు చేస్తున్న డెంటిస్ట్

ఆలూరు రూరల్: ప్రతి ఒక్కరూ తమ దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆలూరు సీహెచ్‌సీ డెంటిస్ట్ పద్మజ అన్నారు. జాతీయ నోటి ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా ఆలూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం 15 మందికి నోటి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించారు. తీవ్ర పంటి నొప్పితో బాధపడుతున్న ఇద్దరు రోగుల దంతాలను తొలగించి ఐరన్, క్యాల్షియం ట్యాబ్లెట్లు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. వృద్ధులు పొగాకు సంబంధిత పదార్థాలు వాడరాదన్నారు. ముఖ్యంగా యువత సిగరేట్, ఖైనీ, గుట్కాలకు దూరంగా ఉంటే.. నోటి క్యాన్సర్ బారిన పడకుండా ఉంటారన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం రెండు పూటల తప్పని సరిగా బ్రష్ చేయాలని సూచించారు. పంటి మధ్య సందుల్లో పుల్లలు, పిన్నులు వంటివి వాడడం మంచిది కాదని తెలిపారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

వెల్దుర్తి: ప్రకృతి వ్యవసాయం, నవధాన్యాల సాగుపై ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది శనివారం మండల పరిధిలోని బోయనపల్లె, నరసాపురం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నవధాన్యాలతో కలిగే ప్రయోజనాలపై పొదుపు మహిళలు, ఎంపీపీ స్కూల్ విద్యార్థులతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్



ఆలూరు రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఆలూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఎర్ర వెంకట్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాల మేరకు.. హొళగుంద మండలంలోని మార్లమడికి గ్రామ రహదారిలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ గ్రామ సమీపంలోని వేదావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేశామన్నారు. సంబంధిత ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసి మైన్స్ అండ్ జియాలజీ అధికారుకు సమాచారం అందించినట్లు వెల్లడించారు.

హాస్టల్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కృష్ణగిరి: హాస్టళ్లలో ఉండే విద్యార్థుల పట్ల వార్డెన్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పత్తికొండ ఏఎస్‌డబ్ల్యూఓ బాబు సూచించారు. మండల పరిధిలోని ఎరుకలచెర్వు, కంబాలపాడు గ్రామాల్లోని ఎస్సీ హాస్టళ్లను శనివారం ఆయన తనిఖీచేసి పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ముందుగా రికార్డులను పరిశీలించి హాస్టళ్ల పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ డివిజన్ పరిధిలోని 10 హాస్టళ్లలోనూ పదోతరగతిలో వందశాతం ఉత్తీర్ణత తీసుకురావాలన్నారు. ఆయన వెంట వార్డెన్‌లు నాగేశ్వర రెడ్డి, వెంకటేశ్వర్లు ఉన్నారు.

లక్ష్యానికి మించి..

- లాభాల బాటలో ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీ
- 2022–23 శిస్తు వసూళ్ల లక్ష్యం రూ.3.80 కోట్లు
- మార్చి 15కే లక్ష్య సాధన
- ప్రభుత్వ ప్రోత్సాహకాలకు రైతులు ఫిదా



ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ



యార్డుకు రైతులు భారీగా తీసుకొచ్చిన వేరుశనగ దిగుబడులు

ఎమ్మిగనూరు: ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయ లక్ష్య సాధనలో ముందుంది. వరుసగా రెండో ఏడాది కూడా నిర్దేశించిన శిస్తు వసూళ్ల లక్ష్యాన్ని ముందుగానే అధిగమించింది. వివిధ పంట దిగుడులపై సెస్ రూపంలో ఇప్పటికే మార్కెట్ కమిటీకి రూ.3.83 కోట్ల ఆదాయం సమకూరింది.

జిల్లాలో వ్యవసాయ మార్కెట్లలో ఎమ్మిగనూరు కమిటీకి ప్రత్యేక స్థానం ఉంది. వేరుశనగ కొనుగోళ్లకు ప్రధాన మార్కెట్‌గా గుర్తింపు ఉంది. ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాలతోపాటు ఆలూరు నియోజక వర్గంలోని దేవనకొండ, ఆస్పరి మండలాల నుంచి రైతులు ఎమ్మిగనూరు మార్కెట్‌కు పంట దిగుబడులు తీసుకొస్తారు. ఇక్కడ ప్రధానంగా వేరుశనగ, మొక్కజొన్న, కందులు, ఆముదాలు, పొద్దుతిరుగుడు విత్తనాలు, శనగలను రైతులు మార్కెట్‌కు విక్రయానికి తెస్తారు. ఇక్కడ పత్తిమార్కెట్ కూడా ఉంది. అయితే, ఈ ప్రాంతంలో పత్తి జిన్నింగ్ మిల్లులు పెరగటంతో రైతులు నేరుగా అక్కడికే వెళ్లి పత్తి దిగుబడులు విక్రయిస్తున్నారు.

ఈ–నామ్ పద్ధతిలో కొనుగోలు: ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో పంటదిగుడుల కొనుగోళ్లన్నీ ఈ–నామ్ పద్ధతిలో జరుగుతున్నాయి. దీంతో రైతులకు గిట్టుబాటుకు మించిన ధరలు లభిస్తున్నాయి. అయినప్పటికీ కొంతమంది దళారి మర్చంట్స్ సిండికేట్‌గా మారి రైతులను దోచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నా గతంతో పోల్చితే ఇది చాలా తక్కువ. గతంలో మాదిరిగా రైతులు దళారి మర్చంట్స్ దగ్గర అప్పులు తీసుకోకుండా ప్రభుత్వమే పంట పెట్టుబడులకు రైతు భరోసా సాయం అందించటం, సున్నా వడ్డీ రుణాలను అందిస్తుండటంతో వారి ఆగడాలు చాలా వరకూ తగ్గుముఖం పట్టాయి.

ముందుగానే లక్ష్య సాధన..

ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో ఈ ఏడాది పంట ఉత్పత్తుల క్రయ విక్రయాలు బాగా జరిగాయి. ఈ సంవత్సరం రూ.3.80 కోట్లు ఆదాయం రాబట్టాలని యార్డు లక్ష్యంగా పెట్టుకొంది. అయితే, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ ఎన్నో రైతు సంక్షేమ పథకాలను అమలులోకి తెచ్చింది. దీనికి తోడు ఈ సారి పంటదిగుబడులకు గిట్టబాటుకు మించిన ధరలు లభించాయి. దీంతో ఎమ్మిగనూరు మార్కెట్‌యార్డు ఎప్పుడూ పంట ఉత్పత్తులతో కళకళలాడింది. ఫలితంగా యార్డుకు సెస్ రూపంలో మార్చి15వ తేదీకే రూ.3.83 కోట్లు ఆదాయం సమకూరింది. నెలాఖరుకు మార్కెట్ ఆదాయం మరింతగా పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గత నాలుగేళ్లలో ఒక్క ఏడాది మినహా ప్రతి ఏటా లక్ష్యాన్ని మించిన రాబడి సాధిస్తూ మార్కెట్ కమిటీ రికార్డు సృష్టించింది. పత్తి కొనుగోలు కూడా మార్కెట్‌యార్డులో చేపట్టి ఉంటే మరింత ఆదాయం సమకూరేదంటూ రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

గత ఏడేళ్లుగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదాయ వివరాలు..

సంవత్సరం	లక్ష్యం (రూ.లక్షల్లో)	వచ్చిన ఆదాయం (రూ.లక్షల్లో)
2016-17	378.00	309.69
2017-18	340.00	314.88
2018-19	380.00	245.53
2019-20	347.57	358.56
2020-21	368.00	264.82
2021-22	348.00	348.06
2022-23	380.00	383.09 (మార్చి15వరకు)

మంచిరేటు వచ్చింది



ఈ ఏడాది ఖరీఫ్‌లో మార్కెట్ యార్డుకు 26 సంచుల వేరుశనగ తెచ్చాను. పంటదిగుబడి శాంపిల్‌ను ల్యాబ్‌లో టెస్టుచేసి' ఏ ' గ్రేడ్ ఇచ్చారు. క్వింటం ధర రూ.7021.99కు అమ్ముడు పోయింది. అప్పట్లో చేతితో వేరుశనగను నులిమి(పరీక్షించి) వారికి ఇష్టమొచ్చిన రేట్లు రాస్తూ రైతులను మోసం చేసేవారు. ఈ–నామ్ పద్ధతిలో కొను గోలు మాలాంటి రైతులకు మేలు చేస్తోంది.

– మహబూబ్‌బాషా, మారందొడ్డి, సి.బెళగల్ మండలం

మార్కెట్ ఆదాయం పెరిగింది



గత నాలుగేళ్లుగా ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి ఆదాయం పెరుగుతూ వస్తోంది. 2020–21 కోవిడ్ కష్టకాలం మినహా ప్రతిఏటా లక్ష్యాన్ని అధిగమిస్తున్నాం. ప్రభుత్వ తోడ్పాటు, ప్రకృతి సహకారంతో పాటు రైతులకు మద్దతు ధరకు మించిన గిట్టుబాటు ధరలు లభిస్తుండటం శుభ పరిణామం. ఈనెలఖరులోపు కమిటీ ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉంది.

– ఉమాపతిరెడ్డి,గ్రేడ్–1 కార్యదర్శి

శ్రీరంగనాథుడి హుండీ లెక్కింపు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

మద్దికెర: మండల పరిధిలోని శ్రీరంగనాథుడి తాత్కాలిక, శాశ్వత హుండీలోని కానుకలను శనివారం లెక్కించారు. హుండీ ద్వారా రూ. 33,66,661 వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఏసీ ఆఫీసర్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో హుండీ లెక్కించడం జరిగిందన్నారు. గతేడాది మార్చి 21 నుంచి నవంబర్ 29 వరకు హుండీ రూ. 12,86,892 అలాగే గతేడాది నవంబర్ 29 నుంచి ఈఏడాది మార్చి 18 వరకు రూ.14, 15,836 చదివింపులు ద్వారా రూ.3,27,098 సేవా టికెట్లు ద్వారా రూ. 2,66,835 ఉభయములు ద్వారా రూ. 70 వేలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రంగస్వామి, సిబ్బంది రఘు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బ్రహ్మగుండంలో..

వెల్దుర్తి: బ్రహ్మగుండం ఆలయ హుండీలో భక్తులు సమర్పించిన కానుకలను శనివారం లెక్కించారు. గత ఫిబ్రవరి 6వ తేదీ నుంచి ఈనెల 18 వరకు లెక్కించగా మొత్తం రూ.77,978 సమకూరినట్లు ఆలయ ఈఓ హనుమంతరావ్, చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి తెలిపారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

- హౌసింగ్ పీడీ వెంకటనారాయణ



నేలతలమర్రి గ్రామంలో జగనన్న గృహాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ వెంకటనారాయణ

ఆలూరు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్‌పీడీ వెంకటనారాయణ సిబ్బందికి సూచించారు. శనివారం దేవనకొండ మండలం నేల తలమర్రి, దేవనకొండ, కరివేముల తదితర గ్రామాల్లోని జగనన్న కాలనీలను సందర్శించారు. అక్కడ గృహ నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని, ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని చెప్పారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించాలని హౌసింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఏప్రిల్ 5 నాటికి జిల్లాలో 5 లక్షల కుటుంబాలు జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు చేయాలన్నారు. ఈ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లో నిర్మాణ పనులను డీఈ, ఏఈలు పర్యవేక్షించాలన్నారు. పీడీ వెంట ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, హౌసింగ్ ఏఈ అనిరుధ్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నీకంతేశ్వరనాయుడు, నాగరాజ్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

- జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి

కృష్ణగిరి: సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు వచ్చాయని జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఆయన మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మూల స్తంభంగా సచివాలయ వ్యవస్థ పనిచేయాలన్నారు. గ్రామాల్లో సచివాలయాల సేవలు పెంచాలని, సిబ్బంది పనితీరు కూడా మెరుగుపడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించడంలో కీలకపాత్ర వహించాలన్నారు. అలాగే మహిళా కానిస్టేబుల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతోపాటు ప్రతి సచివాలయ ఉద్యోగి తమ విధులు సమర్థవంతంగా నిర్వహించినప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు. అనంతరం కృష్ణగిరి సచివాలయం, నూతనంగా నిర్మించుకుంటున్న ఇళ్లను పరిశీలించారు. సమావేశంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ మోహన్‌కుమార్, ఏఓ వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్ రామస్వామి వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పత్తికొండ డివిజన్ పరిధిలోని మండలాల ఎంపీడీఓలతో జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని మండలాల పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతంగా చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా సచివాలయాలు, ఆర్‌బీకేలు, జగనన్న హెల్త్ క్లినిక్‌లతో పాటు పంచాయతీల పరిధిలో జరుగుతున్న అన్ని పనులు సకాలంలో పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

రెవెన్యూ ఉద్యోగుల నిరసన

ఆలూరు: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలను ధరించి శనివారం దేవనకొండ, హాలహర్వి, ఆలూరు తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ విష్ణు మాధవ్, సీనియర్ అసిస్టెంట్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ, పాత పీఆర్సీతో పాటు జీతాలను సకాలంలో ఇవ్వాలన్నారు. సర్వేయర్ అరుణజ్యోతి, వీఆర్వోలు పాల్గొన్నారు.

సంఘాలను బలోపేతం చేయాలి

కృష్ణగిరి: గ్రామాల్లో పొదుపు సంఘాలను బలోపేతం చేస్తూ ,ప్రతి మహిళా పొదుపు పాటించేలా కృషిచేయాలని ఏపీఎం దాసన్న సూచించారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు, వీబీకేలతో సమావేశం నిర్వహించారు. బ్యాంక్‌ల ద్వారా గ్రామాల్లో పొదుపు సంఘాలు తీసుకున్న రుణాలను సక్రమంగా వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో మండల మహిళా అధ్యక్షురాలు సరోజమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రేపటి నుంచి కబడ్డీ పోటీలు

ఆస్పరి: ఉగాది పండుగను పురస్కరించుకుని చిరుమాన్‌దొడ్డి గ్రామంలో ఈనెల 20వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. పోటీల్లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.12,116,రూ.8,116, రూ. 5,116, రూ.3, 116 వేలు చొప్పున బహుమతులు ఇవ్వను న్నట్లు చెప్పారు. పాల్గొనే వారు ఈనెల 19వ తేదీలోపు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 96528 055 68, 95739 65033ను సంప్రదించాలన్నారు.

చెరువుల పరిశీలన

తుగ్గలి : మండల పరిధిలోని బొందిమడుగుల, రాంపల్లి, ఎద్దులదొడ్డి, తుగ్గలి, జొన్నగిరి, మామిల్లకుంట చెరువులను శనివారం డోన్ రైల్వే డివిజనల్ అసిస్టెంట్ ఇంజినీర్ సీహెచ్ పాపారావు పరిశీలించారు. మైనర్ ఇరిగేషన్ ఏఈ చంద్రశేఖర్‌తో కలిసి చెరువు కట్టల భద్రతను పరిశీలించారు. రైల్వే సమీపంలో ఉన్న చెరువు కట్టలు ఏమైనా బలహీనంగా ఉంటే రైల్వేట్రాక్‌కు ఇబ్బంది కలిగే అవకాశం ఉంటుంది. దీంతో ముందస్తుగా చెరువు కట్టల భద్రత పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందిస్తామని ఆయన వెల్లడించారు.

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

ఎమ్మిగనూరుటౌన్: రాయలసీమలోని సాగునీటి పారుదల ప్రాజెక్టులకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఏసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హనీఫ్ కోరారు. శనివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సీమలోని పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ఎమ్మిగనూరుటౌన్: మండల కేంద్రం గోనెగండ్లలో ఆదివారం ఎమ్మిగనూరు సాయిరాం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని ఆసుపత్రి డైరెక్టర్ శివన్న శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి

హొళగుంద: ప్రధానమంత్రి బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హొళగుంద ఎస్‌బీఐ మేనేజర్ కృష్ణప్రసాద్ కో రారు. గతేడాది కోగిలతోటకు చెందిన హనుమంతి అనే పాలసీదారురాలు మరణించారు. నామినీ అయిన భర్త గాదిలింగప్పకు రూ.2 లక్షలు మంజూరైంది. అందుకు సంబంధించిన ధ్రువీకర ణ పత్రాన్ని శనివారం బ్యాంక్ మేనేజర్ అందజేశారు.

తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

తుగ్గలి : రామకొండలో తలెత్తిన తాగునీటి సమస్య పరిష్కారానికి సర్పంచ్ హారిక, గౌరవ సలహాదారు సుధాకరరెడ్డి చర్యలు చేపట్టారు. ఎస్సీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను తీర్చేందుకు పెండేకల్లు రైల్వే జంక్షన్ నుంచి వచ్చే పైప్‌లైన్‌కు కనెక్షన్ ఇచ్చి తాగునీరు సరఫరా చేసేందుకు పనులు చేస్తున్నారు.

వైఎస్ జగన్ పాలనలో అభివృద్ధి పరుగులు



అయ్యకొండలో బ్రిడ్జి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

- ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి
- అయ్యకొండలో బ్రిడ్జి పనుల పరిశీలన

గోనెగండ్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు పెడుతోందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అయ్యకొండ గ్రామ సమీపంలో ఎల్లెల్సీ కాలువ మీద రూ.40 లక్షలతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులను శనివారం ఈఈ శైలేశ్వర్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్మాణ పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సీఎం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. తుంగభద్ర దిగువ కాలువ మీద చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. వినియోగంలోకి వస్తే అయ్యకొండ గ్రామం నుంచి కడిమెట్ల గ్రామం మీదుగా ఎమ్మిగనూరు తదితర గ్రామాలకు రోడ్డు ప్రయాణం సులవవుతుందన్నారు. కార్యక్రమంలో డీఈ లక్ష్మణకుమార్, ఏఈలు మణికంఠ, రామాంజి, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ మృత్యుంజయ, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమలరెడ్డి, కాశీవిశ్వనాథ రెడ్డి, ధర్మకారి నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత



సోగనూరు రహదారిలో బీటీ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణాభివృద్ధిలో భాగంగా రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని సోగనూరు ప్రధాన రహదారిలో బీటీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోగనూరు రోడ్డుతో పాటు మిలటరీకాలనీ, లక్ష్మణ్ థియేటర్ వద్ద గల ప్రాంతాల్లో బీటీ రోడ్డు నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. దీని వల్ల ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. అలాగే పట్టణంలో అవసరమైన ప్రాంతాల్లో రోడ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్ఆర్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టారంగయ్య, అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, టౌన్‌బ్యాంక్ చైర్మన్ యూకే రాజశేఖర్, కౌన్సిలర్లు శివప్రసాద్, గట్టుభాజ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ రోడ్డులోని శ్రీ బడేసాహెబ్ దర్గా వద్ద ఏపీ మాలమహానాడు తాలూకా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్ఆర్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రారంభించారు.కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

సరదాగా కాసేపు పోలీసులతో ..



పోలీసు స్టేషన్‌లో సీఐ, ఎస్‌ఐతో ముచ్చటిస్తున్న విద్యార్థులు

వెల్దుర్తి: నో బ్యాగ్ డేనే వెల్దుర్తిలోని హరిజన వాడ ఎంపీపీ స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా..ఉల్లాసంగా జరుపుకున్నారు. శనివారం పుస్తకాలు లేకుండా స్కూల్‌కు వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పట్టణంలోని వివిధ ప్రదేశాలను సందర్శించారు. మొదట గ్రంథాలయానికి చేరుకుని కథల పుస్తకాలు చదివారు. తర్వాత స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సీఐ యుగంధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డితో వివిధ అంశాలపై కాసేపు సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు పోలీసు స్టేషన్ గురించి, పోలీసుల విధుల గురించి విద్యార్థులకు వివరించి పెన్నులు పంపిణీ చేశారు. విద్యార్థులకు రోజువారీ విద్యా బోధన, పుస్తకాల మోతలకు భిన్నంగా ప్రతి నెల మూడవ శనివారం నో బ్యాగ్ డే ద్వారా వారిని ఆనందంగా ఉంచడంతో పాటు సమాజంపై అవగాహన కల్పిస్తుండటం సంతోషదాయకమన్నారు.

రైతులకు అకాల నష్టం



రామకొండలో రాలిన మామిడి కాయలను ఏరుతున్న రైతు రాంభూపాల్‌రెడ్డి



ముక్కెల్లలో వర్షానికి దెబ్బతిన్న మొక్కజొన్న పంట

తుగ్గలి: అకాల వర్షంతో చేతికొచ్చిన మొక్కజొన్న, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో శుక్రవారం సాయంత్రం ముక్కెల్ల, మారెల్ల, రామకొండ తదితర గ్రామాల్లో ఈదురు గాలులతో వడగండ్ల వాన కురిసింది. దీంతో పలు చోట్ల వ్యవసాయ, ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ముక్కెల్లలో వ్యవసాయ బోరుబావుల కింద దాదాపు 50 ఎకరాల్లో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట నేలకొరిగింది. పంట చేతి కొచ్చే సమయంలో పాడవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. అదే విధంగా మండల వ్యాప్తంగా దాదాపు 500 ఎకరాల్లో సాగైన మామిడి పంట దెబ్బతినింది. ఈదురు గాలులు, వడగండ్ల వర్షానికి మామిడి చెట్లు విరిగి పోవడమే కాకుండా అరకొరగా కాసిన మామిడి కాయలు రాలిపోయాయని రామకొండ రైతులు ఆవేదన చెందుతున్నారు.

